# ఆయన మీ అన్నగారే!

శ్రీమతి వి. వి. సత్యవతి

అదిరొక చిన్న పల్లెటూరు. రైలు స్టేషనుకు, యూరికి రెండు మూడు మైళ్ల దూరముంటుంది. స్టేషనుచుట్టూ చింతచెట్లు కొన్ని యున్నవి. సమీపంలో ట్రంకురోడ్డున్నది. స్టేషను ప్రక్కనే స్టేషను మాస్టరు, పోర్టర్ల నివాసగృహాలున్నవి. వాని నాధారంచేసికొని ఒక చిన్న కాఫీహోటలున్నది.

రామారావు హడావుడిగా పరుగెత్తుకొనివచ్చి కిటికీగుండా బుక్కింగ్ క్లార్కును బెజవాడకు టిక్కెట్టు యియ్యమని అడిగాడు. ప్రక్కగా కూర్చొని సిగరెట్టు త్రాగుతూ ఏదో పేపరు చూస్తున్నాడు గుమాస్తా. అతని వైఖరి రామారావును చీకాకుపరచింది. గట్టిగా మరొకసారి టిక్కెట్టు అడిగాడు.

"ఎందుకయ్యా! అలాగ కేకలు పెడ్తావు! బండిరావడానికి యింకా అర్ధగంట టైమున్నది."

"గంటముందునుండే టిక్కెట్లు యివ్వబడ్తాయని యిచ్చట బోర్డున్నది కదండీ!"

"రాసిన రాతలకు, చేతలకు సంబంధముండదు. ముందు పాసింజరుబండి వచ్చిపోయిన తర్వాతకాని మీ బండికి టిక్కెట్లివ్వబడవు."

"జనసమ్మర్దంలో టిక్కెట్లు సమయానికి దొరక్కపోతేనండీ!"

"ఇచ్చేపూచి నాదికదా! నీవుపోయి పదినిమిషాలపాటు విశ్రాంతిగా కూర్చో."

బుక్కింగ్ క్లర్కు సమాధానాలు రామారావుకు కారము పూసినట్లయింది. పాపం! సంక్రాంతి పండుగకు రమ్మని మామగారు జాబు వ్రాశారు. అది వివాహమయిన తర్వాత మొదటి సంక్రాంతి - పైగా భార్య పుట్టింట్లోనే యున్నది. నాలుగు నెలలనాడు వదలివెళ్ళిన ప్రియురాలిని ఎప్పుడప్పుడుపోయి ... తొందరపెడ్తున్నవి. పాసింజరువచ్చి వెళ్లిపోయింది. మరల కిటికీదగ్గరకు వెళ్ళి రామారావు టిక్కెట్టు అడిగాడు అయిదు రూపాయల కాగితమిచ్చి.

"చిల్లర లేదండీ" అంటూ అయిదురూపాయల నోటు వాపసుచేశాడు.

"భలేబాగుంది! కొంతసేపు టైముకాలేదని, మరికొంతసేపు చిల్లరలేదని చిక్కులు పెడ్తున్నారేమిటి!" అని సణుగుకొంటూ చిల్లరమార్చుకొని వచ్చి కౌంటరుదగ్గర డబ్బు చెల్లించి టిక్కెట్టు యియ్యమన్నాడు.

"ఈ పావలా చెల్లదు; మరొకటి యుంటే యియ్య"మన్నాడు.

"ఇదేమిటీ ఎగతాళి అనుకున్నారా! - నీపై అధికార్లకు తెలియజేస్తానుండు మీ వెకిలిచేష్టలన్నీను" అని అంటూ యుండగా గంట గణగణ మ్రోగింది; రైలు ప్లాటుఫారంమీదికొచ్చి ఆగింది. మరొక పావలాయిచ్చి టిక్కెట్టు తీసికొని పరుగెత్తుకొనివెళ్ళి బ్రతుకుజీవుడాయని బండెక్క ఎక్కకముందే బండి కదిలింది. బుక్కింగ్ క్లర్కు కిటికీనుండి తొంగి చూస్తున్న రామారావునుచూచి "పైఅధికార్లకు నామీద రిపోర్టు చెయ్యడానికి కాగితము, కలము తీసికొనివెళ్లు" అన్నాడు వెటకారంగా. మామగారి యిల్లు చేరి సంక్రాంతి సంబరాల మధ్యయున్నాకూడ బుక్కింగ్ క్లర్కు ప్రవర్తన రామారావు మనస్సును కల్లోలపరుస్తూనే యుండింది.

మూడు నెలలు గడిచిపోయింది. బుక్కింగ్ క్లర్కు ఆదుర్దాగా పోష్టుబంట్రోతు కొరకు ఆనాడు ఎదురు

చూచి, చూచి ఏంజాబులు రాకపోయినవి. మరునాడు ఉదయం త్వరగా పోస్టాఫీసుకు వెళ్లేటప్పటికి కట్టలు విప్పుతున్న రామారావు ప్రత్యక్షమయ్యాడు; ముఖం చిన్నబుచ్చుకొని, 'కె. మాధవరావు, బుక్కింగ్ క్లర్కు అనే చిరునామాతో జాబేమైనా యున్నాయాండీ!' అని అడిగాడు

"ఆ - ఆ - నిన్న వచ్చింది. ఎవరో మీరు బదిలీ అయినట్లు చెప్పితేను డెలివరీకి పంపకుండా నిలిపాను. ఇదిగోచూడండి" అని కవరు తీసి చూపాడు.

దానిమీద అతని భార్య కమల వ్రాసిన చిరునామా దస్తూరీనిచూచి "అదేనండీ! నేనే మాధవరావును - దయచేసి కవరిలాయివ్వండి" అన్నాడు కొంత సంశయంగానే.

"క్షమించాలి! మిమ్మలను ఐడెంటిఫై చెయ్యకుండానే! బంట్రోతు మొదటి డెలివరీకి వెళ్లినట్లుంది - రానీయండి. రెండవ డెలివరీయప్పుడు మీజాబు మీకు మోస్తుంది. మనుష్యులను పోల్చుకోకుండా జాబు లివ్వడం రూల్సుకు వ్యతిరేకం" అన్నాడు రామారావు.

మాధవరావు "నేనేనని చెప్తున్నాను కదండీ! నాజాబును నాకివ్వడానికి మీకెందుకండీ యింత కష్టం!" అన్నాడు తబ్బిబ్బగుచూ.

"సరేలేండి! అంతా మీ ఇష్టమువలెయుందే! పోయి కొంచముసేపు హాయిగా పండుకోండి."

మాధవరావు చేయునదేమిలేక తన చేతుల్లోకి జాబు వచ్చేంతవరకు నిముషమొక యుగంగా యమయాతనకు గురియైనాడు.

నెలరోజులుఅయి, కాకమునుపే తన భార్యను పంపుతున్నట్లు మామగారి ఉత్తరంచూచి ఒక ప్రక్క ఉప్పొంగిపోయాడు; మరొకప్రక్క మాధవరావు ఉనికి కొంత ఆందోళనను కలిగించింది. ఆదరాబాదరా ప్లాటుఫారం టిక్కెట్టు కొనుక్కొని ప్లాటుఫారంమీదికి వెళ్లేసరికి బండి రానేవచ్చి ఆగింది.

లక్ష్మి తొంగిచూస్తున్న పెట్టె దగ్గరకువెళ్ళి తలుపు తీశాడు. ఆమె, వెంబడి సామానులు దిగినై.

లక్ష్మి సామానుల నన్నిటిని లెక్కబెట్టుకొని ఏదో కంగారు పడటం మొదలు పెట్టింది.

"ఏమిటలాగున్నావేమిటి - పోర్టర్ను పిలవనా సామానులు తీసికొని రావడానికి"

"నాన్నగారు కొనియిచ్చిన టిక్కెట్టు ఎక్కడో జారిపోయిందండీ" అన్నది దిక్కుముఖంతో.

మాధవరావు జ్ఞాపక మొచ్చాడు

"ఏడవలేకపోయావూ! ఎందుకొచ్చావు యిక్కడికి" అన్నాడు రామారావు ఉగ్రనరసింహమూర్తిలాగ.

లక్ష్మి వేళ్లు నలుపుకొంటూ తలవంచుకొని నిలబడిపోయింది.

"మరి నీ దగ్గర ఎంత డబ్బున్నది"

"నా వద్దనా - రెండు రూపాయలుంది"

"ఛీ! తెలివితక్కువజన్మ! మళ్లీచదువుకున్న ముఖానివి" అని చీదరించుకుంటున్నాడు రామారావు.

జనసమ్మర్ధం తగ్గిపోయింది. తప్పించుకోడానికి మార్గము ఆలోచిస్తూ రామారావు, భార్య, సామానులతో పోర్టరు ద్వారందగ్గరకు వచ్చారు.

"టిక్కెట్టు, టిక్కెట్టు" అంటూ మాధవరావు చేయిజాపాడు.

పాపం! రామారావు జరిగిన సంగతంతా చెప్పాడు. కాని మాధవరావుకు కసితీర్చుకోడానికి అది అవకాశమయింది.

"అదంతా వీలులేదు - టిక్కెట్టిచ్చి కదలండి" అన్నాడు.

"ఈ రూపాయితీసికొని ......"

"లంచమా! రైల్వే అధికారులు లంచం తీసికుంటారనా మీ యభిప్రాయం! అసలు మీ ఆవిడ

రావడం బెజవాడనుండియో, మద్రాసు నుండియో ఎవరికి తెలుసు"

"నేను ఎక్కింది బెజవాడలో నేనండీ - అక్కడి స్టేషను మాష్టరు మా నాన్నగారికీ బాగా తెలుసును కూడా! మధ్యలో చెక్కింగ్ జరిగేటప్పుడు కూడా టిక్కెట్టున్నది – తర్వాతనే జారిపోయింది" అన్నది లక్ష్మి అమాయకంగా

"మీరు కలంగజేసుకోవాకండమ్మా! ఆయనతో మాట్లాడవలసిన విషయమిది. ఏమండీ! మద్రాసునుండి యిక్కడికి రైలు చార్జి కట్టి వెళ్లిపోండి"

వాళ్ల దగ్గరున్నది రు 3 లు. నిలుచున్నచోట నిలుచున్నట్లు 8 రూపాయలు ఎలాగ సృష్టియగుతవి?

"అట్లయితే మార్గమేమిటి" అన్నాడు రామారావు అర్థంలేకుండా.

"మార్గమా - అదిగో" నన్నాడు రైలుమార్గాన్ని చూపిస్తూ మాధవరావు. లక్ష్మి తన అజాగ్రత్తను నిందించుకొంటూ రైల్వే క్వార్టర్సవైపు చూస్తూ బిక్కముఖంతో నిలబడింది.

అన్నంతిని విస్తరి పారెయ్యడానికి బయటికి వచ్చి సరోజ లక్ష్మిని గుర్తుపట్టి పరుగెత్తుకొనివచ్చి "బండి వెళ్లిపోయినా యింకా యింతసేపు నిలబడియున్నా రెందుకు? రామారావుకూడ ఉన్నాడుగా రాండి పోదాం - ఎండపడింది. ఏమిటలా తెల్లబోయి చూస్తున్నారేమిటి! మేము యిక్కడున్నామని తెలియదా ఏమిటి" అంటూ చేయిపట్టుకొని తమ యింటికి తీసికొని వెళ్లింది. మాధవరావు, రామారావు వెనుకనే వెళ్లారు.

"అదేమిటండీ! అలాచూస్తున్నారు! ఆయన మీ అన్నగారు. మా పిన్నికూతురు లక్ష్మిని తెలియదూ మీకు! ఏడాది నాడు దాని పెండ్లికి మీకు రావడానికి వీలుకాక నేను మాత్రమే వెళ్లాను. అందుకని మీరు రామారావును చూడలేదు. పెండ్లి నాటికే ఆయనకు బెజవాడలో ఉద్యోగం" అన్నది పరిచయంచేస్తూ.

"అవును అక్కా! యిప్పుడు ఆరునెలలనుండి యిక్కడనే ఉద్యోగం. నేనిదే యిక్కడికిరావడం" అన్నది లక్ష్మి.

ఇక చేసేది లేక "రండి అన్నగారూ" అని మాధవరావు, రామారావుతో చేతులు కలిపాడు కాని మనస్సులు మాత్రం అంత సులభంగా కలిసిపోయుంటవంటారా!

---

సెకెండు ఫారం చదువుతున్న అమ్మాయిని "శిశుపాలుడెవరు" అని ప్రశ్న అడిగింది పంతులమ్మ

"శిశుపాలుడాండీ — శిశువులను పాలించే ధర్మాత్ముడైయుండాలి"

◆ ◆ ◆

ఇంగ్లీషు మాష్టరు పాఠం చెప్తూ "Season" అనే పదానికి అర్థము ఏమిటి అని అడిగాడు

ఒక బాలుడు లేచి "సముద్రుని కొడుకు సార్" అన్నాడు.

◆ ◆ ◆

షష్టుఫారంలో ఒక మాష్టరు వేదాంత విషయాలను వివరిస్తూ! "వాసూ! దేవుడంటే ఎవరు? ఎక్కడ యున్నాడు" అని అడిగాడు.

వాసు ప్రక్కనున్న విద్యార్థి గభాలున లేచి "వాసుదేవుడంటే వీడేనండీ— ప్రస్తుతము యిక్కడే యున్నాడుగా!"

అల్లూరి సోదరి